ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు

3★

సోమవారం 19 మే 2025

• ఫటాఫట్

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

• డీఎల్‌పీవో వేణుగోపాల్



ఆంధ్రజ్యోతి : పెద్దపల్లి మండలంలో పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది ?

డీఎల్‌పీవో : మండలంలోని 30 గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ 90 శాతం వరకు బాగుంది. మిగతా 10 శాతం పనులను ఎప్పటికప్పుడు నిర్వహించేలా దృష్టి పెడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : గ్రామాల్లో తాగునీటి సరఫరాలో ఇబ్బందులు ఉన్నాయా ?

డీఎల్‌పీవో : గ్రామాల్లో తాగునీటి సమస్య ఎక్కడా తలెత్తలేదు. కొన్ని ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకేజీలు అయితే తక్షణమే మరమ్మతు చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : దోమల నివారణకు ఎలాంటి చర్యలు చేపట్టారు ? ఫాగింగ్ మిషన్ పనిచేస్తున్నాయా?

డీఎల్‌పీవో : మురికికాలువలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తున్నాం. దోమల నివారణకు వారానికి ఒకసారి ఫాగింగ్ యంత్రాలతో పిచికారి చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : అక్రమ వెంచర్‌లు చాలా ఉన్నాయి. వాటిపై చర్యలేవి ?

డీఎల్‌పీవో : మండలంలో అక్రమ వెంచర్‌లు ఏర్పాటు చేసిన చోట కార్యదర్శుల ద్వారా వారికి నోటీసులు అందిస్తున్నాం. బోర్డులు ఏర్పాటు చేసి కొనుగోలు చేయవద్దని యొద్దని సూచిస్తున్నాం. -పెద్దపల్లి రూరల్

- రెవెన్యూ, దేవాదాయ, గైరాన్, నదీనాలా భూముల ఆక్రమణలు
- రక్షణ చర్యలు తీసుకోవడంలో అధికారుల నిర్లక్ష్యం
- రెచ్చిపోతున్న కబ్జాదారులు



మంథని శివారులో కబ్జాకు గురైన గైరాన్ భూములు

ప్రభుత్వ భూములకు రక్షణ కరువు

మంథని, మే 18: మంథని పట్టణ శివారులో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల రక్షణ కరువైంది. విలువైన రెవెన్యూ, దేవాదాయ, నదినాలా భూములను గుంటలు, ఎకరాల చొప్పున ఇష్టారీతిగా కబ్జాలకు పాల్పడుతున్నారు. మంథని- పెద్దపల్లి ప్రధాన రహదారికి అనుకొని మున్సిపాలిటీ పరిధిలోని గంగాపురి క్రాస్ రోడ్డు పక్కనే ఉన్న గైరాన్ భూములు అన్యా క్రాంతానికి గురవుతున్నాయి. పాత పెట్రోల్ పంపు క్రాస్ శివారులోని మంథని-కాటారం ప్రధాన రహదారి పక్కనే బొక్కలవాగును అనుకొని ఉన్న నదినాలా, రెవెన్యూ, సూరయ్యపల్లి గ్రామ క్రాస్ రోడ్డు సమీపంలోని ప్రభుత్వ భూములను కొందరు యథేచ్ఛగా ఆక్రమించు కుంటున్నారు. శ్రీపాదకాలనీలోని ప్రభుత్వ భూమిని, మంథని-పెద్దపల్లి ప్రధాన రహదారి పక్కనే ఉన్న కూచిరాజ్‌పల్లి శివారు లోని ప్రభుత్వ భూములను సైతం కబ్జాలు చేస్తున్నారు. పెద్దపల్లి రోడ్‌లోని శ్రీవాగుఒడ్డు పోచమ్మ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాలు, నదినాలా భూములను సైతం కొందరు కబ్జా చేయటానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. గంగాపురి బస్టాప్ సమీపంలోని బొక్కలవాగు ఒడ్డు ఉన్న ప్రభుత్వ స్థలం కబ్జాకు గురైంది.

• ప్రభుత్వ భూముల క్రయవిక్రయాలు

కొందరు తమకు ఈ భూములకు పట్టాలు ఉన్నాయంటూ క్రయవిక్రయలు చేస్తున్నట్లు సమా చారం. ఇప్పటికే కొంత భూమి క్రయవిక్రయాల్లో పలువురి పేరిట పట్టాలు, రిజిస్ట్రేషన్లు జరిగినట్లు సమాచారం.

• డిమాండ్ పెరగడంతో కబ్జాకోరుల కన్ను

కొద్ది సంవత్సరాలుగా మంథని పట్టణ విస్తరణ రియల్ ఎస్టేట్ కారణంగా వేగంగా పెరుగుతుండటం తో ప్రధాన రహదారికి అనుకొని ఉండటంతో భూము లకు డిమాండ్ వచ్చింది. దీంతో ఈ భూములకు బహిరంగ మార్కెట్‌లో గుంటకు లక్షలాది రూపా యల పైనే డిమాండ్ ఉంది. మున్సిపాలిటీ పరిధిలో మంథని-కాటారం, మంథని-పెద్దపల్లి ప్రధాన రహదా రులకు అనుకొని ఉన్న భూములకు డిమాండ్ రావడంతో పాటు పట్టణ విస్తరణ పెరుగుతుండటం, వెంచర్లు పాట్లు చేస్తుడటంతో ప్రభుత్వ భూములపై కబ్జాదారుల కన్ను పడింది. కొందరు యథేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతుంటే, మరికొందరు ప్రభుత్వ భూముల పక్క ఉన్న భూములను కొనుగోలు చేసి ప్రభుత్వ భూములను సైతం తెలివిగా కబ్జా చేస్తున్నారు. ఇందులో అత్యంత విలువైన కోట్ల విలువ చేసే గైరాన్ భూములను సైతం కొందరు కబ్జా చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

రెవెన్యూ, దేవాదాయ, మున్సిపల్ అధికారులు తమ శాఖలకు చెందిన భూములను కబ్జాలు చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరికలు పెట్టినా కబ్జాదారులు పట్టించుకోవడం లేదు. కొందరు ఏకంగా ఆక్రమణ భూముల్లో ఫెన్సింగ్ వేసుకోవడంతో పాటు మరి కొందరు ఏకంగా భవనాలు నిర్మిస్తున్నారు. రాజకీయ నాయకుల అండదండలతో భూములను మెల్లమెల్లగా ఆక్రమ ణలకు పాల్పడు తున్నారు. ఆయా శాఖల అధికా రులపై ఒత్తిళ్లు తెస్తున్నారు. గత పదేళ్లుగా ఈతంతు కొనసాగుతున్నా పట్టించునే వారే కరువ య్యారు. గుంటకు లక్షల్లో ధర పలికే ప్రభుత్వ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేయడం, కబ్జాలకు గురికాకుండా చర్యలు తీసుకోవడంలో వివిధ శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నా యి. ఇప్పటికైనా ప్రభుత్వ శాఖల అధికారులు సమ న్వయంగా పట్టణ శివారులోని ప్రభుత్వ భూములను సమగ్రంగా గుర్తించి అవి ఆక్రమణకు గురికాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. వీటిని ప్రభుత్వ ప్రజల అవసరాల కోసం ఉపయోగించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి

ఫైటింక్లయిన్‌కాలనీ, మే 18(ఆంధ్రజ్యోతి): 17వ డివిజన్ సంతోష్‌నగర్‌కు చెందిన సమస్యలపై స్థానిక కాంగ్రెస్ డివిజన్ ఇన్‌చార్జి అనుము రాములు, నాయకులు రాజేశంలు ఆదివారం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. వాటర్ ట్యాంక్ చౌరస్తా సమీపంలో పబ్లిక్ నల్లాలను ఏర్పాటు చేయాలని కోరారు. అల్లూరు రోడ్డులో వర్షాకాలంలో నీరు ఇళ్లలోకి వస్తున్నందున కాలువ ఎత్తు పెంచాలని కోరారు. ఓపెన్ నాలా ఉన్న ప్రాంతంలో స్లాబ్ వేయాలని కోరారు.

అపూర్వ సమ్మేళనం

పాలకుర్తి, మే 18(ఆంధ్రజ్యోతి): వారంతా బాల్యమిత్రులు. ఒకేచోట కలిసి చదువుకున్నారు. కుక్కలగూడూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-2006 వరకు 10వ తరగతి పూర్తిచేసుకొని ఎవరి దారిలో వారెళ్లారు. కొందరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తుండగా, మరికొందరు వ్యాపారాల్లో స్థిరపడ్డారు. ఎక్కడో స్థిరపడిన వారంతా ఇరువై ఏళ్ల తర్వాత ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో ఒక్కచోట కలిశారు. జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సందడిగా గడిపారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులను ఆహ్వానించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో తన సర్వీస్ మొత్తాన్ని తన రిటైర్డ్‌మెంట్ వరకు అదే పాఠశాలకు తన సేవలను అందించిన ఆటెండర్ శంకరయ్య దంపతులను సన్మానించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ హెడ్ మాస్టర్ ఐలయ్య, ఉపాధ్యాయులు అశోక్‌రెడ్డి, సారంగపాణి, ఉమారాణి, సుచిత్ర, సుజాత పాల్గొన్నారు.

సింగరేణి ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగావకాశాలు

• ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం • ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ • జాబ్ మేళాకు విశేష స్పందన



నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, సీఎండీ బలరాం



జాబ్‌మేళాకు వచ్చిన యువతీయువకులు

గోదావరిఖని, మే 18(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 60వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించడంతో పాటు అనేక ప్రైవేటు ఉద్యోగాలు కల్పించిందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. ఆదివారం గోదావరిఖనిలో సింగరేణి ఆధ్వర్యంలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన మెగా జాబ్‌మేళాను ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్, సింగరేణి సీఎండీ బలరాంనాయక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుద్యోగ యువకులు ప్రైవేట్ కంపెనీలో జాబ్‌లు వచ్చిన తరువాత రెండు రోజులు పని చేసి ఆ జాబ్‌ను మానేస్తున్నారని, అలా కాకుండా దేశంలో ఎక్కడా ఉద్యోగం వచ్చినా పనిచేయాలని నిరుద్యోగ యువతకు సూచించారు. సింగరేణి యాజమాన్యం దూర ప్రాంతాలకు వెళ్లకుండా ఉన్న ఊరిలోనే ఉద్యోగాలు కల్పించేలా జాబ్‌మేళాను నిర్వహించి యువకులను ఉత్సాహ పర్చడం అభినందనీయమన్నారు. చాలా మంది ఉద్యోగాలు లేక నిరుద్యోగ యువకులు ఇబ్బందులకు గురవుతున్నారని, వచ్చిన అవకాశాన్ని చేజార్చుకోకుండా ఎక్కడ ఉద్యోగం వచ్చినా పనిచేసి తల్లిదండ్రులకు అండగా నిలువాలని సూచించారు. సింగరేణి సీఎండీ బలరాంనాయక్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్క ఆదేశాల మేరకు సింగరేణి సంస్థ మొట్ట మొదటి సారిగా నిరుద్యోగులకు ఉపాధి అవశాలు కల్పించడానికి ఈ జాబ్‌మేళాను నిర్వహించడంతో పాటు అన్ని ఏరియాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి వివిధ కోర్సుల్లో శిక్షణనిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన సుమారు 100ప్రైవేట్ కంపెనీలు ఈ జాబ్ మేళాలో పాల్గొనగా 8వేల మంది నిరుద్యోగులు హాజరయ్యారు. అందులో 3వేల మందిని ఎంపిక చేశారు.



జాబ్‌మేళా వద్ద సందడి

తరలివచ్చిన యువకులు

జాబ్‌మేళాపై పది రోజులుగా విస్తృత ప్రచారం చేయడంతో పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలతో పాటు చత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర సరిహద్దు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నిరుద్యోగులు ఈ జాబ్‌మేళాకు హాజరయ్యారు. మెగా జాబ్‌మేళా ఆర్‌జీ-1 జీఎం లలిత్‌కుమార్ అధ్యక్షతన జరుగగా, డైరెక్టర్లు సత్యానారాయణరావు, వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ నాయకులు సదానందం, నర్సింహులు, సీఎంఓఏఐ కార్యదర్శి రఘుపతి, ఆర్‌జీ-2 జీఎం బండి వెంకటయ్య, సుధాకర్ రావు, ఎస్‌ఓటూ జీఎం గోపాల్‌సింగ్ ఉన్నారు.



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యురాలు

ఖనిలో ఉచిత కంటి వైద్య శిబిరం

కళ్యాణ్‌నగర్, మే 18(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని జామా మసీదు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కంటి వైద్య శిబిరంలో డాక్టర్ భవ్య కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా జామా మసీదు అధ్యక్షుడు అబ్దుల్ రవుఫ్ మాట్లాడుతూ పేదలకు ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వారికి అవసరమైన పరీక్షలను కూడా జామా మసీదు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్ అలీ, నవాబ్, ఘని, రఫి, హకీం, యాసిన్, మౌలానా పాల్గొన్నారు.

వీధి దీపాల ఏర్పాటు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



కుర్మవాడలో వీధి దీపాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

పెద్దపల్లి రూరల్ , మే 18: (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కుర్మవాడలో 'వెలుగని విద్యుత్ దీపాలు' అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి తూముల రవి విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించారు. 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించి తమ వీధిలో వీధి దీపాలు ఏర్పాటు చేశారని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెల యజమానులను ప్రభుత్వం తరుపున ఆదుకుంటాం

• ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్



విప్ అడ్లూరికి గోడు వెల్లబోసుకుంటున్న గొర్రెల యజమానులు

ధర్మారం, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మరెడ్డిపల్లి గ్రామంలో మూడు రోజులగా చనిపోతున్న గొర్రెల యజమానులను అన్ని విధాలా ప్రభుత్వం తరుపున అండగా ఉంటామని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హామి ఇచ్చారు. అస్వస్థతకు గురై మృత్యువాత పడుతున్న గొర్రెలను ఆయన ఆదివారం పరిశీలించారు. అనంతరం పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో పాటు జాయింట్ డైరెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి బాధితులకు ఆర్థిక సహాయం అందించి తగిన న్యాయం చేయాలని సూచించారు. జిల్లా పశువైద్య అధికారి బి.శంకర్, మండల అధికారి కె.అజయ్‌లతో గొర్రెలకు అందిస్తున్న ట్రీట్‌మెంట్ గురించి అడి తెలుసుకున్నారు. మొత్తం 5 వందల గొర్రెల్లో కొమ్ము రాజేశంవి 22, కొమ్ము కనకయ్యవి 18, రేచవేని మల్లేశంవి 18, సమ్మెట కొమురయ్యవి 19, దాడి నాగయ్య 18 మొత్తంగా 96 గొర్రెలు వృత్యువాత పడగా మరో ఇరవై గొర్రెలు తీవ్ర అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయని బాధితులు అడ్లూరికి తెలిపారు. పెద్ద గొర్రెపోతులతో సహా 15 లక్షల ఆర్థిక నష్టం జరిగిందని మిగతా గొర్రెలు కూడా ప్రమాదంలో ఉన్నాయని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందించి తమ కుటుంబాలను ఆదుకోవాలని లక్ష్మణ్‌కుమార్ వేడుకున్నారు. ఆయన వెంట రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి యాదవ సంఘ నాయకులు మేకల మల్లేశం, మారం తిరుపతి, వేల్పుల నాగరాజు, సిలారపు పర్వతాలు, జంగ మహేందర్, సతీష్, రాదారపు లింగయ్య, సంధినేని కొమురయ్య, రేషవేణి మహేష్, ఆవుల కుమారస్వామి, నాగరాజు, ఏఎంసీ చైర్మన్ రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపిపి కొడారి అంజన్న, ఏఎంసీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహులు, సోగాల తిరుపతి, ఓరెం చిరంజీవి ఉన్నారు.

రైతులకు అందుబాటులో జీలుగు, జనుము

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి) సుల్తానాబాద్ సహకార సంఘం ఆధ్వర్యంలో వానాకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేయడానికి జీలుగు, జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంఘం సీఈఓ బూరుగు సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం నుంచి రైతులకు వీటిని అందజేస్తామని, ముప్పై కిలోల జీలుగు బస్తా ఒక్కంటికి సబ్సిడీ పోను రూ.2,137.50లు, 40 కిలోల జనుము బస్తా ఒక్కంటికి సబ్సిడీ పోను రూ.2.510లు ఉందని పేర్కొన్నారు. బస్తాలు అవసరం ఉన్న రైతులు తమ పట్టాదార్ పాసు పుస్తకాల జిరాక్స్ కాపీలను తీసుకుని సంఘం కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

సుల్తానాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర



సుల్తానాబాద్‌లో హనుమాన్ శోభాయాత్ర

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): హనుమాన్ పెద్ద జయంతి కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్ లో వందలాది మంది హనుమాన్ దీక్షలు చేపట్టిన స్వాములతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. సుల్తానాబాద్ పాత బజార్‌లోని శివాలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. శంకర్ లింగం చైరస్తా, పాత జెండా, వేణుగోపాల స్వామి ఆలయం, మున్సిపల్. పోలీస్ స్టేషన్, రాజీవ్ రహదారి మీదుగా ప్రధాన వీధుల గుండా సాగింది. స్వాములు పెద్ద ఎత్తున భజనలు చేస్తూ పాటలు పాడుతుండగా, భాజా భజంత్రీల మధ్య మహిళల కోలాటాలతో అందరూ భక్తి పారవశ్యంతో తన్మయత్వం చెందారు. శోభాయాత్రలో భాగంగా శ్రీ సీతారాముల, అంజనేయ స్వామి వారి ఉత్సవ విగ్రహాలను రథంలో అలంకరించి రథయాత్ర చేపట్టారు. పుర వీధుల గుండా సాగిన స్వామి వారి రథయాత్రకు ప్రజలు మహిళలు ఇంటింటి నుంచి మంగళహారతులు పట్టారు.

మంత్రి శ్రీధర్‌బాబు పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు

మంథని, మే 18 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల్లో ఎంతో కష్ట పడి పెద్దపల్లి ఎంపీగా గడ్డం వంశీకృష్ణను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు గెలిపిస్తే అయనపైనే ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నాయకులు మంథని సత్యం, మంథని రాకేష్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కాళేశ్వరం దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన పుష్కరాల ఫ్లెక్సీలో ఎంపీ ఫొటో లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదని, మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సతీమణి దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యంగార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడంపై అసహనం వ్యక్తం చేశారు. అసత్య ఆరోపణలు చేయడం సరికాదని ఖండించారు.

'దళిత ఎంపీకి అవమానం అగ్రవర్ణాల కుట్ర'



నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మారం, మే 18 (ఆంధ్రజ్యోతి) కాళేశ్వరం పుష్కరాల్లో శిలాఫలకాలపై, ఫెక్లీలపై పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ పేరు, ఫోటోలు పెట్టకుండా అవమానించడంలో అగ్రవర్ణాల కుట్ర ఉందని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, విశాఖ చారిటబుల్ ట్రస్ట్ మెంబర్ కాడే సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం మండలం కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. దళిత ఎంపీని అవమానించడం తెలంగాణ దళిత జాతికే అవమానమని ఆక్రోశం వ్యక్తం చేశారు. గడ్డం వెంకటస్వామి దేశ నాయకుడని, కాంగ్రెస్ దేశ రాజకీయల్లో కీలక వ్యక్తిగా ఉన్నారని, అలాంటి కుటుంబం నుండి వచ్చిన వ్యక్తిని ఉద్దేశ పూర్వకంగానే అవమాన పరిచారని తెలిపారు. ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన దేవాదాయశాఖ అధికారులపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసి వారిని సస్పెండ్ చేయాలని మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఏదుల్ల అంజయ్య, పొన్నవేని స్వామి, కారేటి వేణు, రమేష్, ఎండీ బాబ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కొప్పుల పరామర్శ

ధర్మారం, మే 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ కార్యకర్త నస్పూరి మొండయ్య కుమారుడు అరవింద్‌ను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరమార్శించారు. అరవింద్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబద్ గచ్చిబౌలిలోని కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా అరవింద్ ఆరోగ్య పరిస్థితి గురించి కొప్పుల ఈశ్వర్ డాక్టర్లను అడిగి తెలుసుకుని మెరుగైన ఆరోగ్యం అందిచాలని సూచించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఎలిగేడు , మే 18: (ఆంధ్రజ్యోతి) మండలంలోని లాలపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మినరగండ మల్లేశం భార్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందగా కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పరామర్శించారు. మృతదేహం వద్ద నివాళులర్పించారు. కుటుంబాన్ని ఓదా ర్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షులు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ ఎంపీపీ తానిపర్తి స్రవంతి మోహన్ రావు,నాయకులు పోచయ్య, బాపయ్య,రాజేశ్,వినోద్, రాజేశం,కిష్టయ్య గ్రామస్తులు కుటుంబ సభ్యులు ఉన్నారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, "DASAM SREEKANTH" S/O. DASAM SUDHAKAR R/O. H.NO: 5-20/1, ALUGUNUR, THIMMAPUR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "DASAM SRIKANTH" S/O. DASAM SUDHAKAR.

AJK-16800

CHANGE OF NAME

★ I, "JAPA RAVINDRA REDDY" S/O. JAPA MALLA REDDY, R/O. H.NO: 4-70, ALUGUNUR, THIMMAPUR, KARIMNAGAR, I HAVE CHANGED MY NAME AS "JAPA RAVINDER REDDY" S/O. JAPA MALLAREDDY.

AJK-16800

CHANGE OF NAME

★ I, GOLI LAXMI, W/O. GOLI BHAGAVAN REDDY, R/O. H.NO. 10-3-23, VIDYA NAGAR, KARIMNAGAR HAVE CHANGED MY NAME AS "GOLI VIJAYA" W/O. GOLI BHAGAVAN REDDY

AJK-16800

3+2 స్కీం కలదు

కావలెను

★ హన్మకొండ స్వచ్ఛంద సంస్థ నందు వాచ్‌మెన్ కావలెను. ఉచిత వసతి + భోజనం కల్పించబడును. సం॥ప్ర॥ 8074465703, 9849038142

AJW-15652

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి

కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640

జగిత్యాల, మెట్‌పల్లి :- సెల్ : 9985411262

వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 9985411063

పెద్దపల్లి :- 9550900238

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



తిరుపతిరెడ్డి(ఫైల్)

సైదాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాయికల్ గ్రామానికి చెందిన రావుల తిరుపతిరెడ్డి(38) అనేరైతు ఆర్థిక ఇబ్బందులతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకొన్నాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలప్రకారం.. శనివారం రాత్రి తిరుపతిరెడ్డి భార్య పిల్లలు, ఇంటి బయట పడుకున్నారు. తిరుపతిరెడ్డి మాత్రం ఇంట్లోని బెడ్‌రూంలో కూలరు వేసుకొని పడుకున్నాడు. ఉదయం అతని భార్య కవిత లేచి తలుపు దగ్గరకు వెళ్లి ఎంత పిలిచినా లేవలేదు. పోన్ చేసిన ఎత్తలేదు. దీంతో తలుపులను బలంగా తన్నడంతో తలుపులు తెరుచుకున్నాయి. లోపలికి వెళ్లి చూసేసరికి తిరుపతిరెడ్డి చీరతో దూలానికి ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడని వారు తెలిపారు. తమకు 2.20ఎకరాల భూమి ఉన్నదని, వ్యవసాయం చేసుకొని జీవిస్తుంటామని తిరుపతి రెడ్డి భార్య కవిత పేర్కొంది. వ్యవసాయం కోసం సుమారు 10లక్షల వరకు అప్పు అయిందని అన్నారు. దీనికి తోడు ఇద్దరు ఆడ పిల్లలున్నారని అప్పులు ఎలా తీర్చాలనే మనస్థాపంతోనే తన భర్త మృతి చెందాడని కవిత తెలిపారు. ఈ మేరకు మృతుడి భార్య కవిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌చార్జీ ఎస్సై భార్గవ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వివాహిత బలవన్మరణం

ఎల్లారెడ్డిపేట, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఓవైపు భర్త అనారోగ్యం.. మరోవైపు ఆర్థికఇబ్బందులు తట్టుకోలేక మనస్థాపం చెందిన వివాహిత నరెడ్ల స్వప్న(32) ఉరి వేసుకుని బలవన్మరణానికి ఒడిగట్టింది. ఈ సంఘటన ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామంలోని స్వప్న భర్త సత్యం ద్విచక్రవాహన మెకానిక్‌గా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యేడాది కిందట అనారోగ్యానికి గురయ్యాడు. దాంతో కుటుంబ పోషణ భారం స్వప్నపై పడింది. భార్యభర్తల నడుమ మనస్పార్థాలు నెలకొనడంతో స్వప్న పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. రెండు నెలల కిందట గ్రామానికి చేరుకున్న ఆమె భర్త అనారోగ్యంతో బాధ పడుతుండడం.. పిల్లల పోషణకు ఆర్థిక ఇబ్బందులతో సతమతమైంది. మనస్థాపం చెందిన స్వప్న గదిలోని వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన ఆమె కూతురు సాత్విక భయంతో కేకలు వేస్తూ చుట్టుపక్కల వారికి చెప్పింది. అక్కడకు చేరుకున్న చుట్టుపక్కల వారు మృతదేహాన్ని కిందకు దింపారు. ప్రొబేషనరీ ఎస్ఐ లక్ష్మణ్ ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని లక్ష్మణ్ వివరించారు. మృతురాలికి భర్త సత్యం, కొడుకు సన్నిహిత్, కూతురు సాత్విక ఉన్నారు.

ఉరి వేసుకుని వృద్ధుడి ఆత్మహత్య



ముత్తయ్య(ఫైల్)

చందుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యం, ఒంటరితనం ఆరోగ్య సమస్యలతో పాటు కంటిచూపు మందగించడంతో ఓ వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ ముత్తయ్య (65) ఒంటరితనం, అనారోగ్య సమస్యలతో పాటు కంటి చూపు మందగించడంతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పది సంవత్సరాల క్రితం మృతిచెందింది. రెండో కుమారుడు మధు డ్రగ్స్‌కు అలవాటు పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెద్ద కుమారుడు స్వామి సౌదీ వెళ్లాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

ధాన్యం కుప్పలను ఢీకొని ఒకరి మృతి



రంజిత్‌కిరణ్ (ఫైల్)

తిమ్మాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపైన రైతులు ఆరబోసిన దాన్యం కుప్పలను ఢీకొని ద్విచక్రవాహనదారుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మల్లాపూర్‌లో చోటుచేసుకుంది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ రూరల్ మండలం మొగ్ధుంపూర్ గ్రామానికి చెందిన నేరెళ్ల రంజిత్‌కిరణ్(32) తన స్నేహితుడు సాజిద్‌తో కలిసి మల్లాపూర్‌లోని స్నేహితుడిని కలిసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై వచ్చారు. తిరిగి అర్ధరాత్రి కరీంనగర్‌కు వెళుతుండగా మల్లాపూర్ గ్రామానికి చెందిన మామిడిసతీష్ అనేరైతు రోడ్డుపై పోసిన దాన్యం కుప్ప కనిపించక దానిని ఢీకొట్టారు. దీంతో బైక్ అదుపుతప్పి కిందపడడంతో రంజిత్‌కిరణ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సాజిద్‌కు స్వల్పగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కరీంనగర్ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి భార్య రితిక ఫిర్యాదు మేరకు రైతు మామిడి సతీష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపారు. సంఘటనా స్థలాన్ని సీఐ సదన్ కుమార్ సందర్శించి రైతులు రోడ్డుపై ధాన్యం ఆరపోయవద్దని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుగ్లాంపల్లి గ్రామంవద్ద రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. సుగ్లాంపల్లి వద్ద నుంచి రోడ్డు పక్క నుంచి నడుచుకుంటూ వస్తుండగా పెద్దపల్లి నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న ట్రాలీవాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అయితే ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆపకుండా వెళ్తుండగా సుగ్లాంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ ఈర్ల వెంకటేశ్వర్లు ద్విచక్ర వాహనంపై వెంబడించి ట్రాలీని పట్టుకుని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకున్నారు. మృతుడు మతిస్థిమితంలేని వ్యక్తిగా భావిస్తున్నారు. ప్రమాదానికి కారకుడైన ట్రాలీ డ్రైవర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ట్రాలీని కూడా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

యువజన సంఘాలకు ఆదరణ కరువు

- కార్యక్రమాల్లో భాగస్వాములను చేయని నెహ్రూ యువ కేంద్రం
- జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులను సాధించిన వారినీ పట్టించుకోని వైనం



గణేశ్‌నగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యువజన సంఘాలు చురుకుగా పని చేసేవి. నెహ్రూ యువ కేంద్రం (ఎన్‌వైకే) ఆధ్వర్యంలో సంవత్సరం పొడుపునా కార్య క్రమాలు నిర్వహించేవారు. రాను రాను కార్యక్రమా లు తగ్గిపోయాయి. ఒకప్పుడు సందడిగా ఉండే ఎన్‌వైకే ఇప్పుడు నిర్మానుష్యంగా మారింది.

నామమాత్రంగా కార్యక్రమాలు

గ్రామీణ ప్రాంతంలోని యువతీ, యువకులను, యువజన సంఘాల సభ్యులను జాతి నిర్మాణంలో పాల్గొనేలా అవకాశాలను కల్పించేందుకు నెహ్రూ యువ కేంద్రాలను దేశవ్యాప్తంగా ఏర్పాటు చేశారు. కరీంనగర్‌లో 1988లో నెహ్రూ యువ కేంద్రం ఏర్పాటు చేశారు. ఘన చరిత్ర ఉన్న కరీంనగర్ నెహ్రూ యువ కేంద్రం దశాబ్ద కాలంగా నామమాత్రంగా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గ్రామీణ ప్రాంత యువజన సంఘాలను సమన్వయం పరచడం, యువజన సాధికారతపై దృష్టి కేంద్రీకరించడం లేదు. గతంలో యువజన ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ఉమ్మడి జిల్లా నుంచి పలువురు ఉత్సవాల్లో పాల్గొని జిల్లాస్థాయి, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో అవార్డులు అందుకున్నారు. ప్రస్తుతం ఆ కార్యక్రమాలేవీ నిర్వహించడం లేదు. సంవత్సరంలో ఒకటి, రెండు కార్యక్రమాలను నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. వాటిలోనూ యువజన కేంద్రాలకు భాగస్వామ్యం కల్పించడం లేదు.

కోర్సుల ఊసే లేదు...

నెహ్రూ యువ కేంద్రంలో కుట్టు మిషన్, టైలరింగ్, బ్యూటిషన్ కోర్సులు నిర్వహించేవారు. ప్రస్తుతం అవి మచ్చుకైనాఆ లేదు. కలెక్టర్ ఈ విషయంపై దృష్టి సారించాలని యువజన సంఘాల నేతలు కోరుతున్నారు. యువజన సంఘాల సారథ్యంలో క్రీడా పోటీలను బ్లాక్, జిల్లా స్థాయిలో పోటీలను గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించేవారు. ప్రస్తుతం అవి కనుమరుగయ్యాయి.

నాయకులకు ప్రాధాన్యం కరువు

సామాజిక సేవే పరమావధిగా తమ జీవితాలను పణంగా పెట్టి జిల్లాలోని పలువురు యువజన సంఘాల నాయకులు నెహ్రూ యువ కేంద్రానికి అనుబంధంగా పనిచేశారు. యువజన చైతన్య సదస్సులు, శ్రమదానం, మొక్కలు నాటడం వంటి స్వచ్ఛంద సేవ, స్వయంసేవా లాంటి కార్యక్రమాలతో పాటు యువజన సంఘ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించారు. జిల్లాకు రాష్ట్ర, జాతీయ స్థాయిలలో సామాజిక సేవా విభాగంలో ఉత్తమ యువజన అవార్డులు తెచ్చిపెట్టారు. ఇప్పుడు తమను పట్టించుకునే వారేలేరనివారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వార్షిక ప్రణాళిక మాటే లేదు

నెహ్రూ యువ కేంద్రంలో వార్షిక ప్రణాళిక ఊసే ఎత్తడం లేదు. యువతకు ఇచ్చే శిక్షణలు, చేపట్టే కార్య క్రమాలు, వచ్చిన బడ్జెట్ ఎంత తదితర వివరాలను కేంద్రంలోని నోటీస్ బోర్డుపై ఉంచాలి. ఈ నిబంధనను పట్టించుకున్న వారే లేరు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా గ్రామీణ యువజన సంఘాలకు చేరాల్సిన నిధులను ఇష్టారాజ్యంగా ఖర్చు పెడుతున్నారనే విమర్శలున్నాయి. జిల్లా అధికారులు నెహ్రూ యువ కేంద్రంపై దృష్టి సారించి ఎన్‌వైకేకు గత వైభవం తీసుకు రావాలని యువజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

అందరినీ భాగస్వాములు చేయాలి

- సత్తినేని శ్రీనివాస్, రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత



యువజన, మహిళా సంఘాలను, అవార్డు గ్రహీతలను ఎన్‌వైకే కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలి. ప్రభుత్వాలు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకలను గ్రామీణ ప్రాంతలకు చేరవేసేందుకు అందరి భాగస్వామ్యం అవసరం.

యువజన సంఘాలను పట్టించుకోవడం లేదు

- మెతుకు హేమలత, హేమలత ఫౌండేషన్ అధ్యక్షురాలు



రిజిస్టర్ చేసుకొన్న సంఘాలకు సరైన గుర్తింపు ఇవ్వడం లేదు. నెహ్రూ యువ కేంద్రం ద్వారా చేపట్టే కార్యక్రమాలకు యువజన సంఘాలకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదు. గ్రామాల్లో యువజన కార్యక్రమాలను ప్రోత్సహం కరువైంది. ప్రత్యేకంగా మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించాలి..

- కొండ రవి, జాతీయ యువజన అవార్డ్ గ్రహీత



గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలను జిల్లా కేంద్రంలోని ప్రైవేటు విద్యా సంస్థల్లో నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను గ్రామీణ ప్రాంతాల్లోనే నిర్వహించాలి. ప్రతి కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి అవార్డు గ్రహీతలను భాగస్వాములను చేయాలి.

కలెక్టర్ చొరవ చూపాలి

- అనభేరి నితీషారావు, యువ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్



నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో యువజన సంఘాల పాత్ర చాలా కీలకమైనదీ. యువజన సంఘాలను, యువజన అవార్డు గ్రహీతలను భాగస్వామ్యం చేసే విధంగా కలెక్టర్ చొరవ చూపి సమవేశాలు నిర్వహించి యువజన కార్యక్రమాలను ప్రోత్సహించాలి.

రాళ్లవాగు కుడి కాలువకు మహర్దశ కలిగేనా?

- నేడు ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల ఇరిగేషన్ ఈఎన్‌సీలతో ప్రభుత్వ విప్ సమీక్ష



రాళ్లవాగు కాలువలో అడ్డుగా ఉన్న పొదలు

కథలాపూర్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రాళ్లవాగు ప్రాజెక్ట్ కుడి కాలువకు ఎప్పుడు మహర్దశ పడుతుందా అని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. సోమవారం ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్ ఇరిగేషన్ ఈఎన్‌సీలతో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ కాలువను పరిశీలించి సమీక్ష చేయనున్నారు. ఈ ప్రాజెక్ట్ నిజామాబాద్‌జిల్లా కమ్మరిపల్లి మండలంలోని కోనాపూర్ అడవుల్లో 2005లో అప్పటి వైఎస్ఆర్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా నిర్మించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దాదాపు 3 వేలఎకరాల బీడు భూమిని సాగులోకి తెచ్చేందుకు నిర్మాణం చేశారు. జగిత్యాల జిల్లాలోని భూషణరావుపేట, కథలాపూర్, పెగ్గెర్ల, ఊటపల్లి గ్రామాల్లోని భూములను సస్యశ్యామలం చేయడానికి నిర్ణయం చేశారు. అయితే కుడి కాలువ తూము నుంచి వచ్చే నీటితో పాటు పైభాగం నుంచి వచ్చే వరద నీటి ప్రవాహం కారణంగా ఏటా నక్కల ఒర్రె ప్రాంతంలో తెగిపోతుంది. ఇరిగేషన్ అధికారులు తాత్కాలికంగా మరమ్మతులు చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోతోంది. కాలువ తెగిపోయి చివరి భూములకు నీరందని పరిస్థితి ఎదురవుతోందని రైతులు వాపోతున్నారు. ఎడమ కాలువ ద్వారా 164 ఎకరాలు, కుడి కాలువ ద్వారా 2700 ఎకరాల మేర సాగు కావాల్సి ఉంది.

రెండు జిల్లాల అధికారుల సమన్వయం కరువు

ఈ కాలువ అటు ఆర్మూర్, ఇటు రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలో ఉండడంతో తెగిపోయిన సందర్భంలో రెండు జిల్లాల అధికారులు మరమ్మతుల కోసం అంచనాలు వేయాల్సి ఉంటుంది. దీంతో కాలయాపన జరిగి కాలువ మరమ్మతులకు నోచుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఐదు నెలల క్రితం నక్కల ఒర్రె వద్ద పడ్డ గండిని పూడ్చడానికి కమ్మర్‌పల్లి ఇరిగేషన్ అధికారులు రూ.21 లక్షలతో కల్వర్టు నిర్మించారు. అయితే అదే ప్రాంతంలో మళ్లీ భారీ గండి పడి నీరంతా వృథాగా పోయింది. మళ్లీ అంచనాలు వేయాలంటే రెండు ఉమ్మడి జిల్లాల అధికారులు సమన్వయం చేసుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. పలుమార్లు జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాల పరిధిలోకి ప్రాజెక్ట్‌ను మార్చాలని రైతులు చేసిన విన్నపాలు పట్టించుకోవడం లేదు.

సిమెంట్ లైనింగ్ వేయడమే శాశ్వత పరిష్కారం

తరచూ కాలువ తెగిపోతున్న క్రమంలో కాలువతో అవసరమున్న ప్రదేశాన్ని గుర్తించి శాశ్వతంగా సిమెంట్‌తో లైనింగ్ నిర్మాణం చేపడితేనే పరిష్కారం లభిస్తుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. ఐదు పిల్ల కాలువలకుగాను 2010లో రెండు మాత్రమే నిర్మించారు. అయితే కాలువల్లో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించకపోవడం వల్ల ఆ పనులు అటకెక్కాయి. నష్టపరిహారం చెల్లింపుతో పాటు కాలువకు శాశ్వత పరిష్కారం చూపించాలని రైతులు కోరుతున్నారు.

ధాన్యం కుప్పను ఢీకొని ముగ్గురికి గాయాలు

వీణవంక, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్బాపూర్ గ్రామశివారులో ద్విచక్రవాహనం ధాన్యం కుప్పలను ఢీకొనగా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా పరకాల నుంచి ద్విచక్రవాహనంపై వీణవంక మండలం కోర్కల్‌గ్రామానికి కంచె కిరణ్, కంచెపావని, కూమారుడు రాఘవతో కలిసి వెళ్తున్నారు. ఈ క్రమంలో వరిధాన్యం కుప్పలు ఢీకోట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు108కి సమాచారం అందించగా వరంగల్ అసుపత్రికి తరలించారు. రోడ్డుపై పోసిన ధాన్యం కుప్పలతో వారంలో ఇద్దరు మృతిచెందగా నలుగురికి తీవ్రగాయాలయ్యాయి.

పేకాటరాయుళ్ల అరెస్ట్

బీర్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఓపాతఇంటిలో ఆరుగురు పేకాటరా యుళ్లను బీర్‌పూర్ ప్రొబేషనరీ ఎస్సై తన సిబ్బందితో దాడిచేసి పట్టుకున్నట్లు ఎస్సైతెలిపారు. వారి నుంచి 8,500రూపాయలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

గాజులపల్లిలో ఆరుగురు అరెస్టు..

మంథనిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజులపల్లి గ్రామశివారులో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను ఆదివారం పట్టుకున్నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. డబ్బులు పెట్టి మూడు కమ్మల పేకాట ఆడుతున్న ఆరుగురిని పట్టుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బావిలో పడి రెండు గేదెలు మృతి

రాయికల్, మే 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని చెర్లకొండాపూర్ గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి ఆదివారం రెండు గేదెలు మృతిచెందాయి. నానం సుమలత, ములాసపు మహేశ్వరీలకు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత మేయటానికి గ్రామ శివారులోకి వెళ్లాయి. ఎండతీవ్రంగా ఉండటంతో సమీపంలోని బావి వద్దకు నీటిని తాగటానికి వెళ్లి అందులో పడి గేదెలు మృతిచెందాయి. గేదెల విలువ 80 వేల రూపాయల వరకు ఉంటుందని ప్రభుత్వం నష్టపరిహారం అందిచాలని బాధితులు కోరారు.

అస్తవ్యస్తంగా వాహనాల పార్కింగ్



కొండగట్టు పై జంక్షన్ వద్ద రహదారులకు అడ్డంగా నిలిపిన వాహనాలు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం పరిధిలో వాహనాలు పార్కింగ్ అస్త్యవ్యస్తంగా ఉందని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాహనాలకు తగినట్లు పార్కింగ్ ఏర్పాట్లు చేయకపోవడంతో ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గాలు ఇరువైపులా వాహనాలను నిలుపుతుండడంతో ట్రాఫిక్ జాం అయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. ఆదివారం ఉదయం పై జంక్షన్ ప్రాంతంలో మూడు మార్గాలకు అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహనాల రాకపోకలకు గంటల తరబడి భక్తులు అసౌకర్యానికి గురయ్యారు.

శిథిలావస్థలో ఎస్సారెస్పీ క్వార్టర్లు

- ప్రహరీ లేక ఆక్రమణలు
- దశాబ్దాల తరబడి నిరుపయోగం
- పట్టించుకోని పాలకులు



శిథిలావస్థకు చేరిన అధికారుల క్వార్టర్లు

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణ నడిబొడ్డులో ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు చెందిన ఆస్తులు నిరుపయోగంగా ఉన్నాయి. దశాబ్దాల తరబడి వాటిని అలాగే వదిలేయడం మూలంగా అధికారులు, ఉద్యోగుల, సిబ్బంది నివాసగదులు క్వార్టర్లు పలు కార్యాలయాలు శిథిలావస్థకు చేరాయి. అక్కడక్కడ కూలిపోతున్నాయి. వీటిని ఎవరూ పట్టించుకోకపోవడంలేదు. వాటిని మరమ్మతులు చేయించడమో లేక కూల్చివేయమో చేసి భూములను కాపాడాల్సిన అవసరం ఉంది. లేదా శిథిలావస్థకు చేరిన క్వార్టర్లను బాగుచేసి ఇతర ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణకు ఇస్తే బావుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ వ్యక్తులు, కుటుంబాలు ఇక్కడ నివాసముంటూ ప్రభుత్వ క్వార్టర్లను దర్జాగా ఉపయోగించుకున్నారు.ఎస్సారెస్పీ భూములకు రక్షణ లేకుండా పోయింది. ప్రహరీ లేకపోవడం మూలంగా చుట్టు పక్కల కొంతభూములు ఆక్రమించుకుని నిర్మాణాలు చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

కాలువల తవ్వకం కోసం క్యాంప్ ఏర్పాటు

సుల్తానాబాద్ ప్రాంతంలో శ్రీరాంసాగర్‌ప్రాజెక్టు కాలువల నిర్మాణం పనులు ప్రారంభదశలో ఆ నిర్మాణాలు పర్యవేక్షించడం కోసం సుల్తానాబాద్ పట్టణంలోని నీరుకుళ్ల రోడ్డులో, డీ- 86 ప్రదాన కాలువకు సమీపంలో ఎస్సారెస్పీ ఇంజనీరింగ్ విభాగంతోపాటు పర్యవేక్షణ అధికారుల కోసం ఏకంగా ఇక్కడ ఒకక్యాంపును ఏర్పాటుచేశారు. ఈఈ మొదలుకొని పలువురు డీఈఈలు, ఏఈఈలు, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కోసం 1978లో క్వార్టర్లు ఆఫీసులు నిర్మించారు. ఓ మాదిరి కాలనీయే ఇక్కడ నిర్మించారు. వాటర్‌ట్యాంకు, తద్వారా అన్ని ఆఫీసులకు, క్వార్టర్లకు పైప్‌లైన్లు వేసి నేరుగా నల్లాలద్వారా నీటి సరఫరా ఏర్పాటు చేశారు. కాలనీ నలువైపులా చక్కటి రోడ్లను తీర్చిదిద్దారు. అందమైన మొక్కలు నాటి చెట్లను పెంచారు. ఒకపుడు సుల్తానాబాద్ పట్టణానికే ఈ ఎస్సారెస్పీ క్యాంప్ కొత్త కళ, శోభను తెచ్చింది.మొదట్లో అధికారులు, ఉద్యోగులు సిబ్బంది అందరూ ఈక్వార్టర్లలోనే నివాసం ఉండేవారు. కానీ ప్రస్తుతం ఎవరూ ఇక్కడ ఉండడం లేదు. కరీంనగర్ తదితర పట్టణాల నుంచిరాకపోకలు సాగిస్తూ విదులకు హాజరవుతున్నారు. దాంతో రానురాను నిర్వహణ, పర్యవేక్షణలు కొరవడి ఈ క్యాంపును పట్టించుకోవడమే మానేశారు.

కేవలం నాలుగు మాత్రమే వినియోగంలోకి..

విశాలమైన ఆవరణలో నిర్మించిన ఎస్సారెస్పీ క్యాంపు ప్రస్తుతం కళావిహీనంగా మారింది. డివిజన్ కార్యాలయం అంటే ఎవరూ నమ్మని తీరులో ఉంది. ఆఫీసు ముఖద్వారమే చెత్త చెదారంతో, శిథిలావస్థకు చేరిన క్వార్టర్లతో నిండి ఉంది. ప్రస్తుతం నాలుగు క్వార్టర్లను మాత్రమే వినియోగిస్తున్నారు. ఈఈ, డీఈఈ, రికార్డులతోపాటు మరో క్వార్టర్‌ను వినియోగిస్తున్నారు. అవి కూడా శిథిలావస్థకుచేరి ఉన్నవేకావడం గమనార్హం.. రాజుల సొమ్ములు రాళ్లపాలు అన్న చందంగా ప్రభుత్వ ఆస్తులు ఇలా నిరర్థకంగా పడి ఉండడాన్ని పలువురు గుర్తు చేసుకుంటూ ఆవేధన చెందుతున్నారు. భూముల ధరలు ఎక్కువగా ఉండడంతో ఈ భూములపై కన్నేసిన పలువురు వీటిని ఆ పేరుతో ఈ పేరుతో ఆక్రమించుకునే అవకాశాలు లేకపోలేదని పలువురు అంటున్నారు.

ప్రహరీ నిర్మాణంతో ఆక్రమణలకు చెక్

- ఎస్సారెస్పీ ఈ ఈ ప్రసాద్

సుల్తానాబాద్ ఎస్సారెస్పీ క్యాంపు గురించి, ఇక్కడ నిరుపయోగంగా, శిథిలావస్థకు చేరి ఉన్న క్వార్టర్ల, ఆఫీసుల గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడడానికి ముందు క్యాంపు చుట్టూ ప్రహరీని నిర్మించడానికి ప్రతిపాదనలు పంపించాము. ప్రహరీనిర్మాణం తర్వాత క్వార్టర్ల వినియోగం గురించి కూడా తగినచర్యలు తీసుకుంటాము. ఎవరు అక్రమణలకు పాల్పడ్డ చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. సుల్తానాబాద్ డివిజన్ పరిధిలోని పలుసబ్‌డివిజన్ కార్యాలయాలు కూడా తిరిగి యదాస్థానంలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.



కూలిపోతున్న క్వార్టర్లు

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

ముత్తారం మే 18 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ముత్తారం గ్రామ పంచాయతీకి చెందిన పింగిలిప్రమీల అనే వృద్ధురాలి మెడనుంచి గుర్తుతెలియని దొంగలు బంగారుగొలుసును అపహరించారు. ఇంట్లో నిద్రిస్తున్న వృద్ధురాలిని శనివారం రాత్రి సమయంలో తలుపుతట్టడంతో వృద్ధురాలు తమబంధువులని తలుపుతీసింది. ఒక్కసారిగా మెడలో ఉన్న గొలుసులాక్కొని వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధురాలికి గాయాలుకాగా స్థానికులుపోలీసులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన వారు సంఘటన స్థలానికి చేరుకున్నారు. వృద్ధురాలు ఇచ్చిన ఫిర్యాదు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు. త్వరలో దొంగలను పట్టుకొని కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

రేపటి నుంచి ఆర్జిత సేవలు రద్దు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టులో మంగళవారం నుంచి గురువారం వరకు జయంతిఉత్సవాలు జరుగనుండగా ఆలయంలో ఆర్జితసేవలు నిలి పివేస్తున్నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. శుక్రవారం వరకు ఆర్జితసేవలు వాహనపూజలు, అభిషేకాలు, సత్యనారాయణవ్రతాలు ఉండవనిభక్తులు సహకరించాలని కోరారు. శనివారం నుంచి ఆర్జితసేవలు యథావిధిగా కొనసాగుతాయని ఈవో తెలిపారు.

కౌన్సెలింగ్‌తో వృద్ధుల కేసుల పరిష్కారం

జగిత్యాల అర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను పోషించక నిరాధరిస్తున్న కొడుకులకు,కోడళ్లకు జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కౌన్సెలింగ్‌ఇచ్చారు. ఈ సందర్భంగా వారు తల్లిదండ్రులను పోషిస్తూ వారిబాగోగులు చూసుకుంటామని ఒప్పంద పత్రం రాసి ఇచ్చినట్లు హరి అశోక్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా హరిఅశోక్‌కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులను పోషించకుండా నిరాధరిస్తే రెవెన్యూడివిజనల్ అధికారి వయోవృద్ధుల ట్రిబ్యునల్ చైర్మన్ ఆరునెలలకు పైగా జైలుశిక్ష వేసే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రుల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే వాటిని తిరిగి స్వాధీనంచేసుకునే అవకాశం కలెక్టర్‌కు ఉందని ఆయన హెచ్చరించారు.

పోటెత్తిన భక్తజనం

- నాలుగో రోజు లక్షన్నర మంది పుణ్యస్నానాలు
- రద్దీగా మారిన రోడ్లు.. ఎట్టకేలకు వన్‌వే
- వారాంతపు సెలవుతో సందడిగా కాళేశ్వరం

కాళేశ్వరం, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతి నది పుష్కరాలకు ఆదివారం భక్తజనం పోటెత్తారు. పుష్కరతీరంతో పాటు కాళేశ్వరాలయం భక్తులతో కిటకిలాడాయి. వారాంతపు సెలవు కావడంతో కాళేశ్వరం పరిసరాలన్నీ ఆదివారం సందడిగా మారాయి. ఆదివారం మెయిన్ పుష్కరఘాట్‌లో సుమారు లక్షన్నర మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు.

● బారులు తీరిన వాహనాలు

ఆర్టీసీతో పాటు ప్రైవేటు వాహనాలు భారీగా తరలిరావడంతో రహదారులు కిక్కిరిసి పోయాయి. 15కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరాయి. దికారులు భక్తుల రాకను అంచనా వేయడంలో విఫలమవుతుండడంతోనే ట్రాఫిక్ సమస్య ఏర్పడిందనే విమర్శలు వస్తున్నాయి. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు మొత్తం అటవీ ప్రాంతమవ్వడం.. అందులోనే 15 వరకు మూలమలుపులుండటంతో ట్రాఫిక్‌జాం అవుతోంది. దీంతొ అధికారులు వన్‌వేను ప్రారంభించారు. పుష్కరస్నానాలు పూర్తిచేసుకున్న వాహనాలను అన్నారం, దామెరకుంట, గంగారం గ్రామాల మీదుగా పంపిస్తున్నారు. రద్దీ తగ్గితే మళ్లీ పాత మార్గంలోనే వాహనాలకు అనుమతిస్తున్నారు.

● ప్రముఖుల దర్శనాలు

సరస్వతీ పుష్కరాల్లో భాగంగా పలువురు ప్రముఖులు పుష్కరస్నానం ఆచరించారు. పుష్పగిరి పీఠాధిపతి అభినవోద్దండ విద్యాశంకర భారతీ మహాస్వామీతో పాటు సినీ నటుడు రాజేంద్ర ప్రసాద్, హైకోర్టు జడ్జి సుధా దంపతులు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పుష్కర స్నానాలు ఆచరించారు. అనంతరం ఆలయంలో కాళేశ్వర ముక్తీశ్వర స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.


సినీ నటుడు రాజేంద్రప్రసాద్‌తో భక్తులు


కాళేశ్వరం ఆలయం వద్ద భక్తుల రద్దీ

● సాఫీగా సాగిన దర్శనాలు..

మూడు రోజులుగా దర్శనాలకు సాదారణ భక్తులు ఇబ్బందులు పడగా ఆదివారం సర్దుకుంది. దేవాదాయ శాఖ అధికారులు దర్శనాలకు ప్రత్యేక చొరవ తీసుకోవడంతో దర్శనాలు సాఫీగా సాగాయి. క్యూలైన్ల వద్ద, ప్రధాన గోపురం వద్ద సిబ్బంది పర్యవేక్షించారు.

● ఆలయానికి వెళ్లేందుకు ఇబ్బందులు

పుష్కరాలకు వచ్చిన భక్తులకు దర్శన తిప్పలు తప్పడం లేదు. తాత్కాలిక ఆర్టీసీ బస్టాండు నుంచి పుష్కరఘాట్‌కు ఉచిత బస్సులు, ప్రైవేటు వాహనాలతో భక్తులకు వెళ్లేందుకు సదుపాయాలు కల్పించగా అక్కడి నుంచి ఆలయానికి వెళ్లేందుకు ఎలాంటి ఏర్పాట్లు లేవు. దీంతో భక్తులు ఇబ్బందిపడుతున్నారు.

● అందుబాటులోకి ఏరియల్ రైడ్..

సరస్వతి పుష్కరాల సందర్భంగా భక్తులు విహంగ వీక్షణం చేసేందుకు ఏరియల్ రైడ్ అందుబాటులోకి తెచ్చారు. ఆదివారం నుంచి పుష్కరఘాట్ మార్గంలోని హెలిప్యాడ్ నుండి రైడ్స్‌ను ప్రారంభించారు. ఒక్కో భక్తుడు .4500 రూపాయలు చెల్లించి కాళేశ్వరాలయంతో పాటు త్రివేణి సంగమ పరిసరాలను జాయ్‌రైడ్స్‌లో చూపించనున్నారు. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్‌లోను ఈరైడ్స్‌కు టికెట్ బుక్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.


కాళేశ్వరంనకు వెళ్లేదారిలో బారులు తీరిన వాహనాలు




గోదావరికి హారతి ఇస్తున్న భక్తులు

జయంత్యుత్సవాలకు కొండగట్టు ముస్తాబు

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబు అవుతోంది. సోమవారం సాయంత్రం ఉత్సవాలకు ఆలయ అర్చకులు అంకురార్పణ కార్యక్రమాలు చేపట్టనుండగా మంగళవారం నుంచి స్వామి సన్నిధిలో హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాల కోసం అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు రంగులు వేశారు. ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించే త్రయాహ్నిక త్రికుండాత్మక యజ్ఞంకు యాగశాలను సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి-జేఎన్‌టీయూ మార్గంలో, కొండపైన స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. ప్రతియేటా నిర్వహించే హనుమాన్ పెద్ద జయంతిని ఈసారి అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మూడు రోజులపాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి లక్షలాదిగా అంజన్న దీక్షాపరులు, భక్తులు కొండగట్టుకు చేరుకోనున్నారు. ఆలయానికి లైటింగ్ పనులు జరుగుతున్నాయి.


లడ్డూలు తయారు చేస్తున్న సిబ్బంది


నైజంక్షన్ ప్రాంతం నుంచి ఏర్పాటు చేస్తున్న పందిళ్లు

● అధికారుల పర్యవేక్షణ

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో జరిగే హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు గాను భక్తులకు ఇక్కట్లు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. కొండపైకి వచ్చే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా ఏర్పాట్లపై ఇప్పటికే ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్పీ అశోక్‌కుమార్ జిల్లా స్థాయి అధికారులు, దేవస్థానం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. వందలాది పోలీసులచే బందోబస్తుకు ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వందేళ్ల సంబరం..

- వృద్ధురాలికి నూరేళ్ల పుట్టిన రోజు
- కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటిన వేడుక

గంభీరావుపేట, మే 18 (ఆంధ్రజ్యోతి): రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలకేంద్రంలో మెర్ల రామవ్వ అనే వృద్ధురాలి 100వ పుట్టిన రోజు సంబరాలను కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. రామవ్వకు ఆదివారంతో 100ఏళ్లు నిండాయి. మండల కేంద్రంలోని ముదిరాజ్ ఫంక్షన్ హాల్‌లో కుటుంబ సభ్యులు అందరూ ఒకచోట చేరి రామవ్వతో కేక్ కట్ చేయించారు. ఆటా పాటలతో సాగిన ఈ వేడుక కుటుంబ సభ్యుల అనుబంధాన్ని చాటి చెప్పింది. కార్యక్రమంలో రామవ్వ కుమారులు, కుమార్తెలు, కోడళ్లు, అల్లుళ్లు, మనవలు, మనవరాళ్లు, మునిమనవలు, మునిమనవరాళ్లు సమష్టిగా నిర్వహించారు. దాదాపు రామవ్వకు ముగ్గురు కొడుకులు, నలుగురు కూతుళ్లు కాగా, మొత్తం కుటుంబ సభ్యులు 70 మంది వరకు ఉన్నారు.


100 ఏళ్ల పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న రామవ్వ


కొండగట్టు ఆలయం ముందు భక్తులు

కొండగట్టులో భక్తుల సందడి

మల్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ నది పుష్కరాల నేపథ్యంలో కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో పుష్కర భక్తులతో కోలాహలం నెలకొంది. కాళేశ్వరంలోని సరస్వతీ నది పుణ్యస్నానాలకు వెళ్తున్న భక్తులు, తిరిగి వస్తున్న భక్తులు మార్గమధ్యంలోని కొండగట్టు అంజన్నను దర్శించు కుంటున్నారు. దీంతోరెండురోజులుగా కొండగట్టు భక్తులతో రద్దీగా మారింది.

గోపాలమిత్రల గోడు పట్టేదెవరికి?

- వేతనాలు అందక ఇబ్బందులు
- ఎనిమిది నెలలుగా పెండింగ్
- రాష్ట్రంలో 1,530 గోపాలమిత్రలు


జగిత్యాల జిల్లా గొల్లపల్లిలో పశువులకు టీకాలు ఇస్తున్న గోపాలమిత్రలు

జగిత్యాల, మే 18 (ఆంధ్రజ్యోతి): పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాల మిత్రల గోడు పట్టించుకునే వారు లేకుండా పోయారు. పశు పోషకులకు సహాయ సహకారాలు అందించే ందుకు పశువైద్య శాలల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన గోపాల మిత్రలకు ఎనిమిది నెలలుగా వేతనాలు అందడం లేదు. వచ్చే అరకొర వేతనం సైతం సకాలంలో అందకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది. కుటుంబ పోషణ భారంగా మారుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారు.

● పశువైద్యంలో కీలకపాత్ర

పశు సంవర్ధక శాఖలో గోపాల మిత్రలు కీలకపాత్ర పోషిసున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1530 మంది గోపాల మిత్రలుండగా, జగిత్యాల జిల్లాలో 22 మంది పనిచేస్తున్నారు. పశువులకు కృతిమ గర్భధారణ చేయడంతో పాటు మేకలు, గొర్రెలకు ప్రాథమిక వైద్య అందిస్తుంటారు. అదే విధంగా పశువులకు వాక్సినేషన్లు వేయడంలో, కృతిమ గర్భధారణ లక్ష్యాలు నెరవేర్చడంలో గోపాలమిత్రలు కీలకంగా వ్యవహరిస్తుంటారు. పశువుల సంఖ్య మేరకు గోపాలమిత్రలకు కృతిమ గర్భధారణ టార్గెట్లు నిర్ణయిస్తున్నారు. ఒక్కో గోపాలమిత్రకు నెలకు వంద కృతిమ గర్భాధారణ చేయాల్సి ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతులు సహజ గర్భధారణకు ప్రాధాన్యం ఇస్తుంటారు. దీంతో గోపాల మిత్రలు టార్గెట్లు పూర్తి చేయడంలో ఇక్కట్లు ఎదుర్కొం టున్నారు. కొన్ని సందర్భాల్లో టార్గెట్లు రీచ్ కాలేందటూ గౌరవ వేతనాల్లో కోత విధిస్తున్నారని గోపాలమిత్రలు వాపోతున్నారు. పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి సమస్య తీసుకవెళ్లినా ఫలితం ఉండడం లేదంటున్నారు.

● ఎనిమిది నెలలుగా వేతనాలు పెండింగ్

గోపాల మిత్రలకు ఒక్కొక్కరికి నెలకు రూ. 11,050 గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి 2025 ఏప్రిల్ వరకు ఎనిమిది నెలల గౌరవ వేతనం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఎనిమిది నెలలకు పైగా చిల్లిగవ్వ చేతికి రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారి ఇబ్బందుల పాలవుతున్నారు. ఇచ్చే అరకొర వేతనాల్లో కోతలు విధిస్తుండడం, నెల నెలా చెల్లించకపోవడంతో అప్పు చేస్తూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి

- వేములవాడ గంగారం, గోపాలమిత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు, జగిత్యాల



పశు సంవర్ధక శాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు రావాల్సిన తొమ్మిది నెలల పెండింగ్ వేతనాలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలి. ఏ నెలకు ఆ నెల గౌరవ వేతనం అందేలా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకోవాలి. ఇచ్చే అరొకర వేతనాలు ఎప్పటికప్పుడు అందకపోవడంతో అవస్థల పాలవుతున్నాం.

ఇబ్బందులు పడుతున్నాం

-చెరుకు శ్రీనివాస్, గోపాలమిత్రల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు,



పశు సంవర్ధకశాఖలో పనిచేస్తున్న గోపాలమిత్రలకు సక్రమంగా వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నాం. మా కష్టానికి తగ్గట్టుగా వేతనాలు ప్రతినెలా చెల్లించాలి. ఉద్యోగ భద్రత కల్పించాలి.

బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది

- డాక్టర్ కె. వేణుగోపాల్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జగిత్యాల



గోపాలమిత్రలకు అందించే గౌరవ వేతనాల బడ్జెట్ విడుదల కావాల్సి ఉంది. జిల్లాలో పనిచేస్తున్న గోపాలమిత్రల వివరాలను ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పంపుతున్నాం. బడ్జెట్ కేటాయిస్తే వారి బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ అవుతాయి.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- దర్శనానికి రెండు గంటల సమయం
- రాజన్న సేవలో మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

వేములవాడ కల్చరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు రాజన్న కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకుని ఆయాక్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకున్నారు. రాజన్నకు ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారుగా రెండు గంటలపాటు క్యూలైన్‌లో బారులుతీరి రాజన్నను దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులకు తలెత్తకుండా అల యాధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిం చారు.


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

రాజన్న సేవలో అయోధ్య లవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు..

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని అయోధ్యలవకుశ జన్మభూమి తీర్థక్షేత్ర అధ్యక్షుడు మహానాథ్ మహేంద్రదాస్‌జీ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి దర్శించుకున్నారు. రాజన్న ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం అద్దాలమండపంలో అర్చకులు ఆశీర్వచనం ఇచ్చారు. ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ రాజన్న ప్రసాదాన్ని అందజేశారు.


రాజన్నకు కోడెమొక్కు చెల్లించుకుంటున్న మహానాథ్ మహేంద్ర దాస్‌జీ

పెద్దమ్మ జాతరకు ఏర్పాట్లు



జాతర వివరాలు వెల్లడిస్తున్న కమిటీ పెద్దలు

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ జాతర కమిటీ అధ్యక్షులు కంకనాల కొమురయ్య, ఉపాధ్యక్షుడు అన్నవేని అంజయ్య, గరిగంటి కుమార్‌బాబు, చుక్కమోగిలి, రాజేందర్ తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని కనుకుల గ్రామంలో పెద్దమ్మ ఆలయంలో ఆదివారం సమావేశమై జాతర ఉత్సవాల వివరాలను తెలిపారు. పెద్దమ్మ జాతర వేడుకలు ఈ నెల 28 న బుధవారం గ్రామంలో జోలే ఎత్తడంతో ప్రారంభ మవుతాయని వివరించారు. జాతర వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మ వారికి కుంకుమపూజలు నిర్వహిస్తారు. ఆదివారం పోచమ్మ బోనాలతో ఊరేగింపు చేస్తారు. మంగళవారం పుట్టపూజ, బుధవారం పెద్దమ్మతల్లి బోనాలు, జాతర కార్యక్రమాలు ఉంటాయని కమిటీ ప్రతినిధులు వివరించారు.

పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన



కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

కమాన్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): కమాన్‌పూర్ గ్రామపంచాయితీ పరిధిలోని పిల్లిపల్లెలో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఆదివారం ప్రారంభమయింది. వేద పండితుల ఆధ్వర్యంలో భక్తులు కుంకుమ పూజలు చేశారు. ఉదయాన్నే హోమం, గణపతి పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుల ఎన్నిక

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఆయిల రమేష్, ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన వాకర్స్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన కమిటీ బాధ్యులను ఎన్నుకుని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల అధికారిగా రిటైర్డు ప్రభుత్వ హెచ్‌ఎం రాజేంద్రప్రసాద్ వ్యవహరించారు.

స్వాములకు పండ్ల పంపిణీ

సుల్తానాబాద్, మే 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరిన స్వాములకు యువ సంకల్ప ఫౌండేషన్ పండ్లు, మంచినీరు పంపిణీ చేసింది. పెద్దపల్లి, భూపాలపల్లి, మంచిర్యాల తదితర జిల్లాల నుంచి పాదయాత్రగా బయలు దేరిన స్వాములకు సుల్తానాబాద్ పట్టణంలో యువ సంకల్ప ఫౌండేషన్ ఆదివారం పండ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టింది. ఐదు వేల మంది స్వాములకు పంపిణీ చేస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకులు తుమ్మ రాజ్‌కుమార్ తెలిపారు.

మాల విరమణ రథయాత్ర

కమాన్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నేడు మాల విరమణ రథయాత్ర నిర్వహిస్తామని హనుమాన్ సేవా సమితి సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ రథయాత్రలో హిందూ బంధువులందరు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

హనుమాన్ భక్తులకు అన్నదానం

కమాన్‌పూర్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ భక్తులకు రామగిరి మండలం సుందిళ్ళ గ్రామానికి చెందిన మండల పాపిరెడ్డి నందమ్మ ఆదివారం ఆదివరహస్వామి ఆలయ సన్నిధిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రవన్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, సువర్ణ గోపాల్‌రెడ్డి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ శోభాయాత్ర

యైటింక్లయిన్‌కాలనీ, మే 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక భక్తాంజనేయ దేవాలయంలో ఆదివారం హనుమాన్ దీక్షాపరులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు అఖండ రామనామపారాయణం (24గంటలు) చేశారు. రాత్రి హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు. హనుమాన్ దీక్షాపరులు, భక్తులు అధిక సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు.

భగవతి యూత్ కమిటీ ఎన్నిక

జ్యోతినగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): దశాబ్ద కాలంగా స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్న భగవతి యూత్ కొత్త కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. కాజిపల్లిలోని మయి కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంకటి రవిగౌడ్, ప్రధాన కార్యదర్శిగా పైడి సాయి, కోశాధికారులుగా బత్తిని చంద్రశేఖర్, బుద్దె సతీష్, ఉపాధ్యక్షులుగా మామిడాల గణేష్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా మామిడాల వెంకటేష్, అనుమ చంద్రశేఖర్, మడుపు శివరామకృష్ణ, సహాయ కార్య దర్శులుగా చంద్రమోహన్, శ్రీనివాస్ యాదవ్, అరుణ్, ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నడిపెల్లి సాగర్‌రావు, పెట్టెం శ్రీనివాస్, దీకొండ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న మనాలీ ఠాకూర్

జ్యోతినగర్, మే 18 (ఆంధ్రజ్యోతి): గుండె వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామగుండం ఎమ్మెల్యే సతీమణి మనాలీ ఠాకూర్ అన్నారు. ఆదివారం ఎన్‌టీపీసీ సుభాష్‌నగర్‌లో కరీంనగర్ మెడికవర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, వాతావరణ కాలుష్యం పెరగడంతో కోల్‌బెల్ట్ ప్రాంతంలో గుండె జబ్బులు అధికమయ్యాయని, వయసుకు సంబంధం లేకుండా చాలా మంది గుండెపోటుతో మరణించడం బాధకరమన్నారు. పెండ్యాల మహేష్, యాదగిరి, కోట కరుణాకర్, గుర్రం కిరణ్ పాల్గొన్నారు

ట్రైనింగ్ సెంటర్ ప్రారంభం

రామగిరి, మే 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థ ఆర్జీ-3, ఏపీఏ డివిజన్ ఆధ్వర్యంలో సోమవారం స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని అధికార ప్రతినిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎం.వి.టి.సి కార్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు.

మెడికల్ కళాశాల, జీజీహెచ్‌కు అనుబంధంగా ఫుట్ ఓవర్ బ్రిడ్జి

● ఆర్చిల నిర్మాణానికి రూ.3కోట్లు ● త్వరలో పనుల ప్రారంభానికి శ్రీకారం ● ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, మే 18(ఆంధ్రజ్యోతి): రాజీవ్ రహదారిపై నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటుండడంతో సింగరేణి మెడికల్ కళాశాల గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి అనుబంధంగా రాకపోకల కోసం ఫుట్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. డిగ్రీ కళాశాల వెనుక 20ఎకరాల్లో సింగరేణి మెడికల్ కళాశాల నిర్మాణాన్ని చేయగా మెడికోల రాకపోకలకు ఇబ్బందులు పడుతుండగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించాలని వారం రోజుల క్రితం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి వినతిపత్రం అందించగా రూ.3కోట్ల నిధులు మంజూరు చేస్తూ మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో పాటు పనులను వేగవంతం చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు సూచించారు. ఫుట్ ఓవర్ బ్రిడ్జితో పాటు రెండు స్వాగత తోరణాలు సప్తగిరి కాలనీకి వెళ్లే దారిలో ఒకటి, డిగ్రీ కళాశాల వద్ద ఒక స్వాగత తోరణం ఏర్పాటు చేయాలని మంత్రిని కోరగా దానికి కూడా నిధులను మంజూరు చేశారు. రూ.520కోట్లతో సింగరేణి మెడికల్ కళాశాలను నిర్మించగా రూ..142కోట్లతో గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అన్ని హంగులతో ఐదు అంతస్థుల ఆసుపత్రి భవన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది అక్టోబర్ వరకు ఆసుపత్రి భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాలు జారీ చేశారు.



రామగుండం మెడికల్ కళాశాల

రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం

రాజీవ్ రహదారి నుంచి మెడికల్ కళాశాలకు వెళ్లే రహదారి విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. గతంలో ఇరుకుగా ఉన్న రోడ్డును వెడల్పు చేయడంతో పాటు కళాశాలకు వెళ్లేందుకు, సప్తగిరికాలనీ వాసుల కోసం సెంట్రల్ లైటింగ్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కార్పొరేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న కోనో కార్పస్ చెట్లను తొలగించి రోడ్డు విస్తరించాలని, రాత్రి వేళల్లో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మెడికల్ హబ్‌గా రామగుండం

ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



రామగుండం మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దమే లక్ష్యంగా పెట్టుకున్నాం. ఇటీవల ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ఆర్చిల నిర్మాణం కోసం రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయి. నూతనంగా ఐదు అంతస్థుల భవనానికి రూ.70కోట్లు మంజూరు చేయించడం జరిగింది. మెడికల్ కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తాం.

సుల్తానాబాద్‌లో మద్యం షాపుల మూసివేత

సుల్తానాబాద్, మే 18: (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ పట్టణంలో ఆదివారం మద్యం షాపులు మూసి వేశారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ పక్కనే ఉన్న మద్యం షాపుతో పాటు, దానికి ఎదురు లైనులో ఉన్న మరో వైన్స్ షాపును ఆదివారం సాయంత్రం మూసి వేశారు. దాంతో అప్పటి వరకు ఆ మద్యం షాపనకు అనుబంధంగా ఉన్న పర్మిట్ రూమ్‌లలో మద్యం సేవిస్తున్న వారిని అర్ధంతరంగా బయటకు పంపించారు. ఎందుకు షాపులు మూసివేశారో తెలియదని మద్యం ప్రియులు చర్చించుకుంటున్నారు. ప్రతి రోజు రాత్రి పదకొండైనా మూసి వేయని షాపులు ఈ రోజు ఎందుకో సాయంత్రమే మూసి వేశారని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఈ విషయమై వివరాలు తెలుసుకునేందుకు ఎక్సైజ్ అధికారులను సెల్ ద్వారా సంప్రదించగా వారు అందుబాటులోకి రాలేదు. సోమవారం నుంచి ధరలు పెరుగుతుండటంతో మూసివేశారనే చర్చ జరుగుతోంది.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శ

మంథనిరూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రచ్చపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కన్నెబోయిన రాజం కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదివారం పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాలులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తగరం శంకర్‌లాల్, కనవేన శ్రీనివాస్, మిర్యాల ప్రసాద్‌రావు, జంజర్ల శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు నివాసానికి సినీ నటుడు రాజేంద్రప్రసాద్

మంథని, మే 18 (ఆంధ్రజ్యోతి): సినీ హీరో, హాస్యనటుడు రాజేంద్రప్రసాద్ శనివారం రాత్రి మంథనిలో సందడి చేశారు. కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీ పుష్కరాలకు వెళ్తూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు-శైలజ ఇంటికి వచ్చి కాసేపు సేద తీరి ఆతిథ్యం స్వీకరించి తిరిగి వెళ్లిపోయారు. ఈ విషయం తెలియడంతో ఆయన అభిమానులు, బీఆర్‌ఎస్ పార్టీ శ్రేణులు పుట్ట మధు నివాసానికి వచ్చి రాజేంద్రప్రసాద్‌తో ఫొటోలు దిగారు. వచ్చిన వారితో రాజేంద్రప్రసాద్ సరదగా కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆయన కాళేశ్వరం వెళ్లిపోగా పుట్ట దంపతులు, అభిమానులు వీడ్కోలు పలికారు.



రాజేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న పుట్టమధు

దళిత ఎంపీకి అవమానంపై రాష్ట్రపతికి ఫిర్యాదు

● బాధ్యులపై చర్య తీసుకోకుంటే ఏఐసీసీ ఎదుట ధర్నా చేస్తా ● మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు

మంథని, మే 18 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతి పుష్కరాల ప్రారంభోత్సవం సందర్భంగా దళిత సామాజిక వర్గానికి చెందిన పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణకు రాష్ట్ర ప్రభుత్వ పరంగా జరిగిన అవమానంపై రాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్, ఆసెంబ్లీ సెక్రెటరీకి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పుష్కరాల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన, దేవదాయ శాఖ ఇచ్చిన పత్రికా ప్రకటనల్లో సైతం ఎంపీ వంశీకృష్ణ ఫొటో పెట్టకపోవడం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని అగౌరపర్చినట్లే అన్నారు. భారీ కౌట్‌వుట్‌లో తమ కాళ్ల కింద అమ్మవారి బొమ్మను ముద్రించారని ఆరోపించారు. వీటికి బాధ్యులైన ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యంగార్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. ప్రజాస్వామ్యంలో రాజ్యాంగం ద్వారా పదవి అలంకరించిన వారిని తప్పనిసరిగా గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. దళిత ఎంపీకి జరిగిన అవమానంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఢిల్లీలోని ఏఐసీసీ ఆఫీసు ఎదట ధర్నా చేస్తానని స్పష్టం చేశారు. ఎంపీ వంశీ తమ పార్టీ కాకపోయినా ప్రజాస్వామ్య రాజ్యాంగ బద్దంగా ఎన్నికైన ఆయనకు జరిగిన అవమానంపై ప్రజాస్వామిక వాదిగా స్పందించామన్నారు. మంథని నియోజకవర్గంలో మంత్రి కుటుంబం ఎస్సీ, బీసీ, మైనార్టీలను అనేక అవమానాలకు గురి చేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు ఏగోళపు శంకర్‌గౌడ్, మాచీడి రాజు గౌడ్, తగరం శంకర్‌లాల్, జంజర్ల శేఖర్, కుమార్ పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పుట్ట మధు

'నెల నెలా ఖర్చుల కోసమే బీఆర్‌ఎస్ ప్రెస్‌మీట్లు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ధర్మారం, మే 18 (ఆంధ్రజ్యోతి) నెల నెలా ఖర్చుల కోసమే బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు ప్రెస్‌మీట్లు పెడుతూ కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఏఎంసీ చైర్మెన్ రూప్లానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు తిరిపతిరెడ్డి మండి పడ్డారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వ విప్ అడ్లూరిపై చేసిన వ్యాఖ్యలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో తీవ్రంగా ఖండించారు. హుజురాబాద్‌లో 17వేల దళిత కుటుంబాలకు దళితబంధు ఇస్తే సంక్షేమ మంత్రి హోదాలో ఉన్న ఈశ్వర్ ఎన్ని కుటుంబాలకు దళితబంధు ఇచ్చారో తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అరిగె లింగయ్య, కాడే సూర్యనారాయణ, కొత్త నర్సిహులు, బొల్లి స్వామి, కొడారి అంజయ్య, పోలుదాసరి సంతోష్, అశోద అజయ్, కాంపెల్లి రాజేశం, సోగాల తిరుపతి, ఏదుల్ల అంజయ్య, ఎండీ బాబ పాల్గొన్నారు.

వేగవంతంగా ధాన్యం కొనుగోళ్లు



గుడిపెల్లిలో ధాన్యం లోడు చేస్తున్న హమాలీలు

పాలకుర్తి, మే 18 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెరిగింది. శనివారం నాటికి కొనుగోలు కేంద్రాల్లో 95 శాతం పూర్తి చేశామని కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. రామగుండం మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పుట్నూర్, గుడిపెల్లి, జయ్యారం, ఈసాలతక్కళ్లపల్లి, కుక్కలగూడూర్ కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు 52,000 క్వింటాళ్ల కొనుగోలు చేశామని ఇంకా 8000 క్వింటాళ్ళు నిలువ ఉందని పేర్కొన్నారు. రెండు రోజుల్లో కొనుగోళ్లను పూర్తి చేస్తామని ఆయా కేంద్రాల నిర్వాహకులు తెలిపారు. ధాన్యానికి సంబంధించిన మద్దతుధర, సన్నరకం ధాన్యానికి బోనస్ డబ్బులు రైతులకు సకాలంలో జమ అయ్యేలా తమ వంతు ప్రయత్నం చేస్తున్నామన్నారు.

సరస్వతి పుష్కరాలకు ఖని నుంచి ప్రత్యేక బస్సులు



ఖని బస్టాండ్ ఆవరణలో ప్రత్యేక కౌంటర్



సుల్తానాబాద్ బస్టాండ్‌లో పుష్కరాలకు వెళ్లే ప్రయాణీకులు

కళ్యాణ్‌నగర్, మే 18(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతి పుష్కరాలకు గోదావరిఖని ఆర్‌టీసీ డిపో ప్రత్యేక బస్సులను నడుపుతోంది. దీని కోసం గోదావరిఖని ఆర్‌టీసీ బస్టాండ్‌లో భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లను ఆర్‌టీసీ డీఎం నాగభూషణం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. 15 నుంచి 26 వరకు జరిగే సరస్వతి పుష్కరాలకు ఖనిబస్టాండ్ నుంచి రోజుకు 30ట్రిప్పులు ప్రత్యేక బస్సులను నడుపుతున్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బస్సుల సంఖ్యను పెంచుతామని నాగభూషణం తెలిపారు. ప్రయాణీకులు వేచిచూడకుండా ఎప్పటికప్పుడు పది స్పెషల్ బస్సులను నిర్విరామంగా నడుపుతున్నారు. ఈ బస్సులు గోదావరిఖని, శ్రీరాంపూర్‌కాలనీ, చెన్నూరు మీదుగా పుష్కరఘాట్ వరకు వెళుతున్నాయి. పెద్దలకు రూ.150, పిల్లలకు రూ.80 ధర నిర్ణయించినట్టు తెలిపారు. మహాలక్ష్మి పథకం కూడా అమలులో ఉంటుందన్నారు.

సుల్తానాబాద్ : సరస్వతీ పుష్కరాలకు ప్రజలు ఆర్టీసీ బస్సులు ఎక్కువగా ఆదరిస్తుండడంతో సుల్తానాబాద్ బస్‌స్టేషన్‌లో సందడి నెలకొంది. పుష్కరాల కోసం ఆర్టీసీ వారు ఉదయం ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. కరీంనగర్ నుంచి ఉదయం ఐదు గంటలకు సుల్తానాబాద్ వచ్చే ఆర్టీసీ బస్సుకోసం ప్రయాణికులు తెల్లవారు నుంచే ఎదురు చూస్తున్నారు. ఉదయం నుంచి సాయత్రం వరకు పుష్కరాల రద్దీ కనిపిస్తోంది.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు



మేడారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



యైటింక్లయిన్‌కాలనీలో పూర్వ విద్యార్థులు



ముత్తారంలో పూర్వ విద్యార్థులు

ధర్మారం, మే 18 (ఆంధ్రజ్యోతి) మండలంలోని మేడారం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులతో పాటు కొత్తూరు విద్యాభారతి హైస్కూల్ పూర్వ విద్యార్థులు 'మళ్లీ బడికి పోదాం' పేరుతో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి సందడి చేశారు. మేడారంలో 1992-93కు చెందిన ఎస్‌ఎస్‌సి బ్యాచ్ కొత్తూర్‌లో 2002-03కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమేళనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి వారి పాఠశాలల్లో చదివిన చిన్ననాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. అందరూ ఒకే చోట కలువడంతో విద్యాభారతి కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ సంతోషం వ్యక్తం చేశారు. 33 సంవత్సరాల తరువాత కుటుంబాలతో మళ్లీ కలవడం ఆనందంగా ఉందని మేడారం ఉన్నత పాఠశాల విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులని శాలువాలతో సత్కరించి, మెమెంటోలతో అభినందించారు. ఈ కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు చింతపండు నర్సింగం, నూతి మల్లయ్య, గన్ను సత్యనారాయణరెడ్డి, ఆరెల్లి చంద్రశేఖర్, గుండ రత్నాకర్‌రెడ్డి, ఆర్.ఉపేందర్, సురేందర్, రాజేశం, పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన ముఖ్య నిర్వహకులు మామిడిశెట్టి శ్రీనివాస్, వేల్పుల మల్లేశం, బద్దం మల్లారెడ్డి, సురకంటి తిరుపతి రెడ్డి, గుర్రం తిరుపతి గౌడ్, దాసరి శ్రీకాంత్, తోడేటి సురేష్, తోడేటి నరేష్, ఈర్ల సంపత్ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ: స్పందన స్కూల్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం స్థానిక సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా జరిగింది. పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరంలో పదవతరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు కలిసి రోజంతా ఆహ్లాదంగా గడిపారు. ఇస్కాన్ సంస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న కృష్ణ అనే పూర్వ విద్యార్థిని అప్పటి విద్యార్థులు ఘనంగా సన్మానించారు. తమకు చదువు చెప్పి ఉపాధ్యాయులకు ఆత్మీయ సన్మానం చేశారు. కార్యక్రమానికి స్పందన పాఠశాల వ్యవస్థాపకుడు రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరు అయ్యారు. ఈపూర్వ విద్యార్థుల సమ్మేళనంలో రాజ్ కుమార్, వసంత, వనజ, శారద, రమాదేవి, జోతిర్మయి, సతీష్, సమ్మయ్య, జగన్, శ్రీనివాస్, సారయ్య పాల్గొన్నారు.

ముత్తారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఏర్పాటు చేశారు. 2008-09 వ సంవత్సరంలో పదవ తరగతి పూర్తి చేసిన వారు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారి చిన్ననాటి స్మృతులను గుర్తుచేసుకొని వారి ప్రస్తుత భవిష్యత్తు లను ఒకరికి ఒకరు తెలుసుకున్నారు. అనంతరం వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించి భోజనం కార్యక్రమాలు ఏర్పాటు చేసుకున్నారు.